# నిశ్చితార్థం

"మీ నాన్న రిటైరై హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నారు. నువ్వేమో ఉద్యోగంలో చేరి ఊరేగుతున్నావు. మరి ... నేనెందుకు రిటైర్ కావద్దురా ?"

నాన్నకూ, నాకూ భోజనం వడ్డిస్తూ అమ్మ అలాగనడం కొత్తేమీ కాదు. అమ్మ ఎందుకలా పట్టుబడ్తోందో నాకు తెలీదా !

"నీకు రిటైర్మెంటు ఏమిటమ్మా ?" ఉడికించాలనే అన్నాను

వేడి అన్నంలోకి నెయ్యి, ఆవకాయ కలిపి ముద్దలు లాగిస్తున్నాడు నాన్న.

"వింటున్నారా ?" కొంగు నడుముకు బిగించి నాన్నను నిలదీసింది. నాన్న పెదాలమీద చిరునవ్వు మెరిసి మాయమైంది.

"తింటున్నా ... తింటున్నాను గదా !"

"అబ్బా ! నా మాటంటే ఎప్పుడూ వేళాకోళమేనా ? నాకు కోడలు కావాలని అరిచి ఛస్తుంటే అదో అరిగిపోయిన రికార్డనుకుంటున్నారు గదూ ! అబ్బా కొడుకులు కూడబలుక్కుని నన్నో ఆటపట్టిస్తున్నారు గదూ ! ఇక లాభం లేదు. రేపట్నుంచీ వంటావార్పూ బంద్. నిరవధిక సమ్మె ఖాయం" చారు గరిట తిప్పుతూ బెదిరించి, నోటీసిచ్చేసింది. అయినా ఆగకుండా రుసరుసలు రువ్వుతూనే ఉంది.

"వారెవ్వా ! ఆవకాయ అమోఘం. సాంబారు అద్భుతం. అమ్మ చేతి వంట అమోఘం నాన్నా"

"అద్భుతమో అమృతమో ? ఒరేయ్ క్రాంతీ ! నేను నిన్ను కన్నాను. నువ్వు నన్ను కనలేదు. కాకా పట్టడంలో నువ్వు కాకలు తీరావని తెలుసుగానీ ప్రస్తుతం ఆ పప్పులేవీ మన దగ్గర ఉడకవురా"

"పప్పు బాగానే ఉడికింది గదమ్మా. జబర్దస్తుగుంది" పెరుగన్నంలోకి దోసకాయ పప్పు నంజుకున్నాను.

"ఆహా ! నువ్వట్లానే మాట్లాడ్తే నేనీ క్షణం నుండే అన్నపానీయాలు మానేస్తాను" అంటూ గరిట నాన్నముందు పడేసింది.

"అబ్బో ! దుర్గావతారమెత్తకు దుర్గాభవానీ !" అంటూ నాన్న ప్లేట్లో చేతులు కడుక్కుని "ఒరేయ్ సుపుత్రా, నేను ఉన్నఫళంగా నీ పార్టీలో చేరిపోతున్నాను" అన్నాడు.

"ఏం నాన్నా ! కొంపదీసి..."

"కాదురా క్రాంతికుమారా" అంటూ లేచొచ్చి నా పక్కన కూచున్నాడు. నేను చేతులు కడుక్కుని తువ్వాలుతో తుడుచుకుంటుంటే "కన్నతల్లి అంతగా ఆరాటపడ్తుంటే కాదనొద్దు!" అన్నాడు మళ్లీ.

"అది కాదు నాన్నా ..."

"ఏది ఏమన్నాకానీ, నా చిన్ననాటి స్నేహితుడు వరంగల్‌లో పెద్ద వ్యాపారి. వాడికి అందాల భరిణలాంటి కూతురుందట. నువ్వు రేపే వెళ్లి ఆ అమ్మాయిని చూసి రావాలి. త్వరలోనే నీ పెళ్లి. మీ అమ్మకు విశ్రాంతి. పెళ్లి చూపులకు నువ్వొస్తున్నావని ఫోన్‌లో చెప్పాను. ఇదిగో వాడు రాసిన ఉత్తరం" అంటూ జేబులోంచి ఉత్తరం తీసిచ్చాడు. దానిమీద అక్కడి అడ్రసూ, ఫోన్ నెంబర్లున్నాయి.

"వెళ్లిరారా కన్నా. నువ్వు వెళ్తానంటేనే నేనిప్పుడు భోంచేస్తా"

"సరేనమ్మా"

"మా నాన్నే!" అమ్మ మొహం వికసించింది. నుదుటి కుంకుమబొట్టు నిర్మలాకాశంలో నిండు చందమామలా వెలిగిపోతోంది.

* * *

"నాపేరు ఆమని... మరి నీ పేరో!"

"క్రాంతికుమార్"

"ముచ్చటగొలిపే మీసంకట్టు, అందమైన క్రాపు... యూ ఆర్ వెరీ హాండ్‌సమ్"

"థ్యాంక్యూ. నిండైన అవయవ సంపద, దొండపండు పెదాలు, ఒంటికి అతుక్కుపోయిన డ్రెస్సు... యూ ఆర్ బ్యూటీఫుల్ అపరంజి బొమ్మలాగున్నావు".

"థ్యాంక్యూ. కాకతీయ యూనివర్సిటీలో కామర్సు డిగ్రీ చేశాను. తెల్సా"

"అలాగా ! నేను కంప్యూటర్ ఇంజినీరింగ్ ఫస్ట్ క్లాసులో పాసయ్యాను"

"ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం, అగత్యం నాకు లేదు"

"నేను లెక్చరర్‌గా పనిజేస్తున్నాను"

"వ్వాట్! కంప్యూటర్ ఇంజినీరు కాలేజిలో పాఠాలు చెప్పడమా ! విదేశాలకెళ్తే బోలెడన్ని డాలర్లు సంపాదించవచ్చు దర్జాగా బతకొచ్చు"

"ఇక్కడైతే తృప్తిగా బతకొచ్చు"

"ఛీఛీ ... కంప్యూటర్ ఇంజినీరు ... కంపు ఆలోచనలు"

"కంపైనా సొంపైనా ఎవరిది వారికానందం"

"ఐసీ ! వెరీగుడ్. నేను బాగా ఆలోచించి రెండు మూడు రోజుల్లో ఫోన్ చేస్తా యూ కెన్ గో"

"వచ్చావా క్రాంతీ !" హుషారుగా ఎదురొచ్చింది అమ్మ "పెళ్లిచూపులు బాగా జరిగాయా? అమ్మాయి నచ్చిందా ?"

"నేను వెళ్ళింది చూపులకా లేక మొగుడనే పోస్టు ఇంటర్వ్యూకా ? ఆ తల్లి తన తల్లిదండ్రుల్నిగానీ నా వెంటున్న స్నేహితుణ్ణిగానీ నోరు తెరువనిచ్చిందా ! అహానికి పేరుంటే అది ఆమనే"

"ఆ అమ్మాయి కోటీశ్వరుడి కూతురు. నచ్చకేంజేస్తుందిలే ! కానీ... వాణ్ణి కాస్త ఊపిరి పీల్చుకోనివ్వు" నాన్న అందుకున్నాడు.

"ఆ సంగతులన్నీ తర్వాత చెబుదువుగానీ రాఘవాపూర్ వెళ్తావా క్రాంతీ ?" ఆప్యాయంగా అడిగింది అమ్మ.

ప్రకృతి ఒడిలో పరవశిస్తున్న పల్లె ... రాఘవాపూర్ పేరు వినగానే నా నరాలను సప్తస్వరాలు పలకరించాయి. చిన్నప్పుడా ఊరు చాలాసార్లు వెళ్లేవాణ్ణి. హాయిగా, ఆనందంగా గడిచేదక్కడ. అత్తయ్య, మావయ్య, మధుర, సతీష్ బావ కళ్ళల్లో కదిలారు.

"ఎందుకు నాన్నా ?"

"మీ ఘరానా మావయ్య కొడుక్కు పెళ్ళి కుదిరిందట. రేపు నిశ్చితార్థమట ... రమ్మని ఉత్తరం రాశాడు. అదో గొప్ప ..."

"వావ్ ... సతీష్ బావకా ?"

"అవున్రా ... సతీష్‌కే ... నాక్కూడా రావాలనుంది. మీ నాన్న వద్దంటున్నారు" అమ్మ కళ్ళు మంచుపూలైపోయాయి.

ఉద్యోగపర్వంలో గెజిటెడ్ ఆఫీసర్ ఆశ్వాసంలో ప్రవేశించినప్పట్నుంచీ నాన్న ప్రవర్తనలో విపరీతమైన మార్పు వచ్చింది. సన్నకారు మనుషులతో సన్నిహితంగా మాట్లాడ్డం అవమానంగా భావిస్తున్నాడు. రిటైరయ్యాక కూడా అదే ధోరణి.

"నీ ఖర్మ వెళ్తే వెళ్ళిరా. కానీ గుర్తుంచుకో, రాగానే నీ పెళ్ళికి ముహూర్తం పెట్టిస్తాను".

* * *

అరవై కిలోమీటర్ల బస్సు ప్రయాణం అతలాకుతలం చేసేసింది. ఇంటికో దీపం, ఊరికో బస్సు పథకం రాఘవాపూర్‌లో అమలైనట్టుంది. ముందట్లా మూడు కిలోమీటర్లు నడిచే అవస్థ తప్పింది. బస్సు నేరుగా ఊళ్ళోకొచ్చేసింది.

రామాలయంముందు, బస్టాండు చుట్టూరా వేపచెట్లు నిండుగా పూసి, సిగలో సిరిమల్లెలు సింగారించుకున్న ముత్తైదువుల్లాగున్నాయి. గాలి ఊపులకు స్పందిస్తున్న పొడవాటి కొమ్మలు పరికిణీ సర్దుకుంటున్న కన్నెపిల్లల్లాగున్నాయి. ఆలయానికెదురుగా రావిచెట్టు ఎన్నో తరాల అంతరాలకు ప్రత్యక్షసాక్షి

"మళ్ళీ నా నీడలో ఆడుకుంటావా బాబూ" అని అడిగినట్టనిపించింది.

రఘుకులాన్వయ రత్నదీపమైన శ్రీరామచంద్రుడు అరణ్యావాసం చేస్తూ ఓరోజు ఇక్కడ సతీసమేతంగా విశ్రమించాడుట. భక్తుల కోర్కెలు తీర్చేందుకు ఈ ప్రదేశంలో వెలిశాడట. ఎవరో అజ్ఞాతభక్తులు కట్టించిన దేవాలయాన్ని ఆలంబనగా చేసుకుని రాఘవాపురం వెలిసిందని సీనియర్ సిటిజన్స్ చెబుతుంటారు.

అప్పుడీ నేల మెత్తని గడ్డితో దూదిపరుపులా ఉండేది. సతీష్‌బావ, నేను నేస్తాలతో కబడ్డీ, కోకో ఆడుకునేవాళ్ళం. మా ఆటకు స్పందిస్తూ మధుర చప్పట్లు కొడుతూ చిందులేసేది.

"సూటుబూటు బాగానే ఉంది. గట్లా జూత్తున్నవేంది బాబూ ? ఎవరింటికి పోవాలె ?" మోకాలు వరకూ ధోవతి, బనీను, నెత్తిమీద గడ్డిమోపుతో అసలు సిసలైన భారతీయుడు పలుకరించాడు.

ఉలిక్కిపడి "ఇల్లు నాకు తెలుసు" అంటూ ముందుకు కదిలాను.

అదిగో బురుజు. కాకతీయుల వైభవప్రాభవాలకు ప్రత్యక్ష నిదర్శనం. ఎండాకాలం సెలవుల్లో బురుజు నీడలో చిర్రాగోనె ఆడుకునే వాళ్ళం. పక్షులు బారులుగా తిరిగొచ్చి బురుజు ముందున్న చెట్టుమీద వాలి కిలకిలారావాలతో సంధ్యారాగమాలపిస్తున్నాయి. ఇల్లు చేరుకుంటున్న పశువుల గిట్టల చప్పుడు తాళం వేస్తోంది.

పశువుల గుంపు పెళ్లి ఊరేగింపులా వెళ్లిపోయిండి. పైకెగిసిన గోధూళి పల్చబడింది. గోధూళిలో ఓ మెరుపుతీగ గోమేధికములాగుంది. దివినుండి భువికి దిగివస్తున్న దేవకాంతలా నడిచొస్తోంది. నా ముందుకు రాగానే బ్రేకులుపడిన సైకిల్‌లా ఆగిపోయింది. నేనూ నిలదొక్కుకున్నాను. ఎగరబోతున్న పక్షి రెక్కలా ఆమె కనురెప్పలు టపటపలాడాయి. ఆ తర్వాత చూపులు నిలబడిపోయాయి.

అప్పుడే పితికిన పాలలో సింధూరం రంగరించిన దేహఛాయ, చారడేసి కళ్ళు, వయసు పొంగుల మీద వంకలు తిరిగిన బారెడు జడ, జడనిండా పూలదండ... పగిలిన దానిమ్మ పండులా ఫక్కున నవ్వింది. నిండు పున్నమి వెన్నెల వెలుగుందా నవ్వులో. చేతిలో స్టీలుగిన్నె మెరిసింది.

ఓ పల్లెటూరి పిల్ల నన్ను చూసి నవ్వడమా !

"మ్మ ... రెందుకలా ... న్న...వ్వు..." నాలో ఏదో కలవరపాటు.

"ఇంటికి పోదాం రా!" నా చెయ్యి పట్టి లాఘవంగా లాక్కుపోతోంది. గుండెల్లో ఓ వైపు గుబులు, మరోవైపు సెగలు. ఎవరన్నా చూస్తే పరువు పంచనామాకాదా ! అయినా విడిపించుకోవాలనిపించలేదు. అరెరే ... మా మావయ్య ఇంటికి తీసుకెళ్ళిందే !

"అమ్మా ! ఎవరొచ్చిండ్రో చూడే" అంటూ చెంగున గడపదాటి చెయ్యి వదిలేసింది.

"ఎవరటా ..." లోపలినుంచి అత్తయ్య వస్తూ, "అబ్బా ! ఇంత తొందరగా పాలు దొరికినయా మధురా"

"పాలు దొరకలేదు. పట్నం బావ దొరికిండు చూడు" స్టీలుగిన్నె పక్కనపెట్టి తల్లి పక్కన చేరింది.

హమ్మో ! ఈ మెరుపుతీగ నా మరదలు మధురనా ! పదిహేనేళ్ళక్రితం పూలగౌనులో చేతులు తిప్పుతూ నవ్వులపువ్వులు రాల్చిన మధుర... నేడు నిండుజవ్వని. నన్ను ఎలా గుర్తుపట్టిందబ్బా ! నేనామెను గుర్తు బట్టనందుకు సిగ్గేసింది. నా మనసులో మలయమారుతం వీచింది.

"బాగున్నావా క్రాంతీ!" అత్తం మొహం చేటంతయింది.

"అమ్మానాన్నలు, చెల్లి అంతా బాగున్నారా ?" ఆప్యాయంగా అక్కున చేర్చుకుంది.

అలసిసొలసి అమ్మ ఒడిలో సేద దీర్చుకుంటున్నట్టుంది. కొసరి కొసరి గోరుముద్దలు తినిపించిన అత్తయ్యను ఇన్నాళ్ళూ ఎలా మరిచాను ? పాపం ! తోడబుట్టి, కూడా పెరిగిన అన్నయ్య నిర్లక్ష్యానికి గురైన అత్తయ్య ... ఓ దశాబ్దికాలం పుట్టింటి ఛాయలకు రాని అత్తయ్య... ఎంతగా విలవిల్లాడిపోతోందో ! కడుపులో చెయ్యిపెట్టి కెలికినట్టనిపించింది.

"అంతా బాగున్నారత్తయ్యా"

కట్టలు తెంచుకున్న కాలువల్లా అత్తయ్య కళ్ళు ధారాపాతాలైపోయాయి.

"మా వదిన దేవత. మా అన్నయ్యనే మారిపోయిండు. నా కొడుక్కు నీ కూతురు నివ్వమని ప్రాధేయపడుతూ ఉత్తరం రాసినా జవాబివ్వలేదు. పుట్టింటి మమకారాన్ని వీడలేక ఫోన్ చేసి బతిమాలాను. అయినా మీ నాన్న మనసు కరగలేదు. 'వియ్యానికైనా కయ్యానికైనా అంతస్తులు చూచుకోవాలిగదా. నాకు అమెరికా అల్లుడు కావాలి. నీ బోడి సంబంధం మాకొద్దు' అని మొహమ్మీద గుద్దేసినట్టు ఫోన్ పెట్టేసిండు. నీ చెల్లి పెళ్ళి శుభలేఖ పోస్ట్‌లో వచ్చింది నాయనా...".

"అయినా వెళ్తానందిరా మీ అత్తయ్య. దక్షయజ్ఞానికెళ్ళిన దాక్షాయనిలా అవమానాల పాలవుతుందని నేనే వద్దన్నాను" అన్నాడు మామయ్య వెనకనుండి.

ఇంత తతంగం జరిగిందా !

"ఇవన్నీ నాకు తెలీవు మావయ్యా" అని మామయ్య పాదాలకు నమస్కరించాను. పక్క ఊరిలో టీచర్‌గా పనిచేస్తున్న సతీష్‌బావ వచ్చాడు.

"బాబూ ... క్రాంతీ..." భుజాలు పట్టి లేపాడు మావయ్య.

నిశ్చయించిన నిశ్చితార్థం నిరాఘాటంగా జరిగిపోయింది.

అయస్కాంతం వైపే ఆకర్షింపబడే లోహం ముక్కలా నా చూపులెప్పుడూ మధురవైపే మళ్ళుతున్నాయి.

"ఇదిగో వీడు నా అన్నయ్యకొడుకు. పెద్ద ఉద్యోగం" అంటూ అత్తయ్య నన్ను సగర్వంగా పెళ్ళివారికి పరిచయం చేసింది. మావయ్య ముభావంగానే ఉన్నాడు.

మధ్యాహ్నం భోజనాలయ్యాకా పెళ్ళివారు వెళ్ళిపోయారు. సతీష్‌బావ వాళ్ళ హెడ్మాస్టర్‌ను కలిసొస్తానని వెళ్ళిపోయాడు. అతడు నాపట్ల కినుక వహించినట్టుంది. ఈటెల్లాంటి మా నాన్న మాటలు వాళ్ళ మనసులనెంత గాయపరిచాయో అర్థమైంది. పెళ్ళివారికి నన్ను గొప్పగా పరిచయం చెయ్యడం మావయ్యకు నచ్చలేదేమో !

"అక్కరకు రాని చుట్టాన్ని పట్టుకుని అంతగా మురిసిపోతావెందుకే ? మనతో వియ్యమాడేందుకు అంతస్తులు అడ్డుపెట్టిన మీ అన్నయ్య కొడుకే గదా ! వాళ్ళ దృష్టిలో మనం సామాన్యులం. వాళ్ళు అసామాన్యులు" చురకలంటిస్తున్నాడు.

పాపం ! మధుర చూపులు నేలకు వాలాయి. అత్తయ్య కనుకొలుకుల్లో కదలాడిన నీటిబిందువులు నా గుండెపొరల్ని తట్టినాయి.

అయినా నేనేమనగలను ? వెంటనే వెళ్దామనుకున్నాను.

అత్తయ్య చీరకొంగుతో కళ్ళద్దుకుంటూ, "అక్కరకొచ్చినా రాకున్నా వాడు నా అన్నయ్యనే, వీడు మన మేనల్లుడే" అంటూ కొట్టిపారేసింది. నా అంతరాళాల్లోని అల్లకల్లోలం అరక్షణంలో మాయమైంది.

వెంట తెచ్చిన వారపత్రికతో కాస్సేపు గడిపాను. కానీ మనసు నిలవట్లేదు. మధుర నన్నే కనిపెడుతోంది.

"చిన్నప్పుడు ఆడుకున్న చెరువుగట్టు, రామాలయం చూడాలనుంది మధురా" ధైర్యం చేసి అడిగాను.

"వాడెప్పుడో చిన్నప్పుడు చూశాడు గదా ! నువ్వు వెంట వెళ్ళు మధురా" అత్తయ్య ఆదేశం.

భక్తుడు కోరింది, దేవుడిచ్చింది ఒకటే అయింది.

మధుర అడుగులో అడుగేస్తూ చెరువు గట్టుమీద ఆమె వెనక నడుస్తున్నాను. నెలలు నిండిన గర్భిణిలా చెరువు నిండుగా ఉంది. నీటిమీంచి వచ్చిన గాలి తరంగాలు ఒంటిని చల్లగా స్పర్శిస్తున్నాయి. పూవుమీది తేనెటీగల్లా నుదిటిమీదాడుకుంటున్న ముంగురుల్ని, ఎగిరిపోతానని రెపరెపలాడుతున్న ఓణీని మధుర సవరించుకుంటూనే ఉంది. గాజుల గలగలలు కాలిమువ్వల సవ్వడికి తోడై కర్ణపేయంగా వినబడుతున్నాయి. ఏదన్నా మాట్లాడ్తే బాగుండు.

"చిన్నప్పటి చిలిపిచేష్టలు గుర్తుకొస్తున్నాయా బావా ?" మధుర అడిగింది. ఆ మాట కోయిల పాటలా అన్పించింది.

"ఓ... బాగా గుర్తుకొస్తున్నై..." ఉత్సాహం ఉబికొచ్చింది.

రెండడుగుల స్పీడు పెంచి మధుర పక్కకి చేరాను. చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటూ గట్టు చివరిదాకా వెళ్లాం. శారీరకంగా జంటగా నడుస్తున్నా మానసికంగా ఒంటరి వారమే గదా! అన్పించింది.

తిరిగి వచ్చేటప్పుడు కావాలనే మధుర చెయ్యందుకున్నాను. నా ఒళ్ళు ఝుల్లుమంది.

"బావా !" కరెంటు షాక్ తగిలినట్టులాక్కుంది బుగ్గలమీద సిగ్గుల సింగారం తళుక్కుమంది.

"చిట్టి మరదలా ... గట్టిదానివే"

మధుర మొహం విప్పి మాట్లాడ్తోంది. మా నాన్న మాటలు వాళ్ళ మనసుల్ని ఎంత బాధపెట్టాయో, సతీష్ బావా ఎలా ఫీలయ్యాడో పూసగుచ్చినట్టు చెప్పింది. చివరికి "మీ చెల్లికీ, మా అన్నయ్యకూ సంబంధం పొసగదని మర్యాదగా చెప్పొచ్చుగదా" అంది.

నాన్న స్వభావం నాకు బాగా తెలుసు.

"అయిందేదో అయిపోయింది మధురా!" అనగలిగాను.

వాకిళ్లలో ఆడపిల్లల తొక్కుడుబిళ్ళ, మగపిల్లల క్రికెట్ ఆటలను చూస్తూ రామాలయం

చేరుకున్నాం. బలహీనమైన సూర్యకిరణాలు గుడి శిఖరానికి బంగారు పూతలు పూస్తున్నాయి. మబ్బులు లేని ఆకాశంలా మధుర మోహం నిర్మలంగా ఉంది. దేవాలయంలో ప్రవేశించాం హుషారుగా. సర్వాంతర్యామి సన్నిధిలో సుమ పరిమళం గుప్పుమంది. తీర్థ ప్రసాదాలందుకుంటూ గుడిలో పారాడిన చెడుగుడు వయసును నెమరేసుకున్నాను.

"ఈ అబ్బాయి ఎవరమ్మా మధురా ..." నన్ను తేరిపార చూస్తూ అడిగాడు పెద్దపూజారి.

"మా బావ ..."

"అంటే ... అదేందీ ... క్రాంతికుమార్..." నోరెళ్ళబెట్టాడు.

నేను కూడా పూజారిని పరీక్షగా చూశాను.

"మీరు రామనాథశాస్త్రిగారు కదూ ! అప్పుడీ పొడగాటి గెడ్డంలేదు"

"అవును. చిన్నప్పుడు నువ్వోసారి కోతికొమ్మచ్చి ఆడుతూ కాలుజారి పడిపోయావు గదూ !"

"అవునవును"

"హమ్మయ్యా ... ఎంత హంగామా చేశావనీ ... సరే ... అమ్మానాన్నలు బాగున్నారా ?" అంటూ యోగక్షేమాలడిగి, "శీఘ్రమేవ కల్యాణ ప్రాప్తిరస్తు" శఠగోపం నెత్తిమీదుంచి దీవించాడు.

ఏదో పులకింత ఎదలో గిలిగింతలు పెట్టింది.

లైట్లు వెలిగాయప్పుడే. మధుర బుగ్గలు విరబూసిన ఎర్రమందారాల్లా గున్నాయి. చెవుల జూకాల కదలిక గుండెల్లో గుసగుసలు రేపింది. గుడి ఆవరణనిండా పొన్న, పొగడ, సన్నజాజి, సంపెంగ, కనకాంబరాలు.. రకరకాల పూలచెట్లు, తీగలు ముచ్చట గొల్పుతున్నాయి. కాస్సేపు అటూ ఇటూ తిరిగి చెట్లకింద ఎదురెదురుగా కూర్చున్నాం. పూల సువాసన పులకింతలు రేపుతోంది. మధుర మాట్లాడ్తుంటే మధుర భావనలు పెనవేసుకుంటున్నాయి. చొరవతో సంభాషణ పెంచేశాను.

"పదిహేను రోజుల్లో మీ అన్నయ్య పెళ్ళైపోతుంది. ఇక నీ వంతుగదా"

"మీ చెల్లి పెళ్ళైంది. మిగిలింది నువ్వే కదా?"

"నీకెలాంటి మొగుడు కావాలి మధురా ?"

"నీకెలాంటి పెళ్ళాం కావాలి బావా ?"

ఓర్నీ ! ప్రశ్నలకు ప్రశ్నలే జవాబులై వస్తున్నాయే !

"నాకు ... నా మరదలు మధురలాంటి రతీదేవి కావాలి".

"నాకు... నా బావ క్రాంతికుమార్ లాంటి మన్మథుడు కావాలి"

ఆశ్చర్యానందాలతో కాస్సేపు కళ్ళు, పెదాలు మాట్లాడుకున్నాయి.

"నోటితో అనుకుంటే ఏం లాభం" పెదాలు చప్పరించింది.

"ఇవి వెనకటి రోజులు కావు. మన భవిష్యత్తును మనమే నిర్ణయించుకోవాలి మధురా" సీరియస్‌గా చెప్పేశాను.

నేలమీద మల్లెలు పరిచినట్టున్న ట్యూబులైట్ల వెలుతురు, సుమదళాల పరిమళాలు పిల్లగాలి తరంగాలు, ఎదపొదలో చిందులేస్తున్న చిలిపితనం... చటుక్కున మధుర చెయ్యందుకుని పెదాలకానించుకున్నాను.

కిసుక్కున నవ్వింది. కళ్ళలోకి సూటిగా చూసింది. పెదాలు వణికాయి. గుడిలో శ్రీరామునికి ఆరగింపు సమయం ఆసన్నమైంది. మంటపంలో జనాలు నిండుతున్నారు. మాకంతా కనబడుతోంది.

"మరీ... మీ అమ్మానాన్నలు ..." నేలమీద గీతలు గీస్తోంది మధుర.

"అమ్మ కాదనదు. నాన్న సతాయిస్తాడు. కానీ... అమ్మానాన్నలు కాదుగదా... ఆ హరిహరాదులు దిగొచ్చినా మననాపలేరు. ఎదిరించలేని మనిషి ఎదగలేడనేది నిజం" అంటూ మరో చెయ్యందుకున్నాను.

మంటపమ్మీంచి సన్నాయిరాగాలు వినబడుతున్నాయి. "శ్రీ సీతారాముల కల్యాణం చూతమురారండి..." పాట అది. గుడిగంటలు అదేపనిగా మోగుతున్నాయి. పూజారులు వేదమంత్రాలు పఠిస్తున్నారు. రెండు మనసులూ ఒకటైపోయాయి.

మధుర ఒయ్యారంగా ముందుకు జరిగింది. నేనూ జరిగాను. మబ్బుల ఆకాశం కింద మయూరాల్లా నర్తిస్తున్నాయి మనసులు. ఓ పెద్దగాలి తరంగం ఝుమ్మున వచ్చేసింది. జలజలమని మామీద పూలవర్షం కురిసింది. పూలు కావవి... తలంబ్రాలు... దివిలోని దేవతల ఆశీస్సులు, అక్షింతలు.

**'విపుల' జనవరి 2002 లో**
**ప్రచురితమైంది**

